# ఎదురుచూపు

**చి**న్నా

నేను అక్కడ నుండి బయలుదేరి వస్తున్నపుడు "ఎందుకు వెళ్తున్నావు? మళ్లీ ఎప్పుడు వస్తావు?" అనడిగావు. "అలవాటైన చోట కొన్నాళ్లు వుండాలనిపిస్తోంది. కొన్ని పనులూ వున్నాయి" అని అప్పటికి తోచినదేదో చెప్పేసాను.

నిన్న ఫోన్‌లో నువ్వు "నిజం చెప్పమ్మా... నీకిక్కడ బాగాలేదా?" అని అడిగావు. నీ మాటల్లోని చిరపరిచితమైన ఆత్మీయస్పర్శకు నేను నిలువెల్లా కరిగిపోయాను... కదిలి పోయాను! కన్న కొడుకుతో నా మనసులోని మాటను చెప్పటానికి సంశయమెందుకూ అనిపించింది. నిజంరా... నాకు మీ ఇల్లు నచ్చలేదు! అక్కడ వుండలేకనే ఇక్కడికి వచ్చేసాననేదీ నిజమే! మళ్లీ ఎప్పుడు అక్కడికి వస్తాననే నీ ప్రశ్నకు సమాధానం ఒక్కమాటలో చెప్పటం కష్టమనిపించి వివరంగా తెలియజేయాలనే ఈ ఉత్తరం రాస్తున్నాను.

చదువుకునే రోజుల్నుండీ నీ ఆశలు ... నిరాశలు, నీకు ఇష్టమైన వ్యక్తులు ... కష్టం కలిగించిన సంఘటనలు, నీ ఆశయాలు... ఆనందాలు, ఇలా అన్నీ నాకు చెప్పటం నీ అలవాటు. ఉద్యోగంలో చేరాక కూడా తీరుబడి చేసుకుని నిదానంగా అన్ని కబుర్లు చెపుతుండేవాడివి. నేనూ అంతే. మన కుటుంబవిషయాలే కాకుండా బంధువుల క్షేమసమాచారాలతో పాటు, మంచి సినిమా చూసినా, ఏ పుస్తకంలోని కథ నచ్చినా నీకు పూసగుచ్చినట్లుగా చెప్పాల్సిందే! అలా తరచూ పిచ్చాపాటి కబుర్లు చెప్పుకునే అలవాటు ఉన్నందువల్లే అనుకుంటా నువ్వు దూరంగా ఉన్నావనే విషయం నన్నంతగా బాధించేది కాదు.

ఉద్యోగం మానేసి బిజినెస్ మొదలుపెట్టి నువ్వు హైదరాబాద్‌లో స్థిరపడ్డాక చాలా బిజీ అయిపోయావు. ఏవో పనులు చేయించుకోవటానికి వచ్చేవాళ్లో, నీకు పనులు చేసిపెట్టేవాళ్లో ఎవరో పదిమంది ఎప్పుడూ నీ చుట్టూ ఉండటం... వ్యాపార లావాదేవీల్లో భాగంగా పెద్ద ఎత్తున పార్టీలివ్వడం లేక పార్టీలకెళ్లడం... అనేవి మామూలయ్యాయి. కాదు తప్పనిసరి అయ్యాయి! మనం తీరుబడిగా మాట్లాడుకునే సమయాలు కుదించుకుపోయి కేవలం ముఖ్యమైన కుటుంబ విషయాల ప్రస్తావనకే పరిమితమయ్యాయి. దీనిని నేను సహజంగానే భావించాను.

నువ్వు ఖాళీ సమయమనేది లేకుండా శ్రమ పడుతున్నావు.... నీకలల్ని నిజం చేసుకుంటున్నావు! నువ్విప్పుడు నగరంలోని సంపన్న వర్గానికి చెందిన ప్రముఖ వ్యక్తివి! ఆర్థికంగా అంత ఎత్తుకు ఎదిగి నువ్వనుకున్నది సాధించగలిగినందుకు నాకూ సంతోషంగా, చాలా గర్వంగా కూడా ఉండేది! ఇక ఉపోద్ఘాతం ముగించి నేను చెప్పాలనుకుంటున్న అసలు విషయానికి వస్తాను. మనం కొంచెం వెనక్కి... అంటే నువ్వు ఉద్యోగంలో చేరిన రోజుల దగ్గరకు వెళ్లాలి. అన్నీ నీకు తెలిసిన విషయాలే అయినా మళ్లీ ఒకసారి గుర్తు చేసుకుంటున్నట్లుగా చెప్పుకుందాం. నాకయితే నువ్వు చాలా సంగతులు మర్చిపోయావనే అనిపిస్తోంది! ఎవరూ కూడా నడిచి వచ్చిన దారిని మర్చిపోకూడదు. అప్పుడప్పుడూ గత అనుభవాల్నీ, జ్ఞాపకాల్నీ నెమరేసుకోవటమనేది మనల్ని మనం తీర్చిదిద్దుకునే విషయంలో కొంచెంగానైనా ఉపయోగపడుతుందని నా నమ్మకం.

నీకు గుర్తుందిగా, నువ్వు ఉద్యోగంలో చేరిన కొత్తలో నువ్వూ, నేను ఎవరో తెలిసినవాళ్ల పెళ్లికని కాకినాడ వెళ్లి, తర్వాత అక్కడే ఉంటున్న చంద్రం మామయ్యా వాళ్లింటికి వెళ్లాం. చంద్రం మా పెదనాన్నగారి అబ్బాయే అయినా సొంత అన్నయ్యలా ఆప్యాయంగా ఉంటాడు. ఆఫీసు పని మీద ఎప్పుడు కాకినాడ వెళ్లినా నువ్వు వాళ్లింటికి వెళ్లొస్తావనీ, మామయ్య కూతురు శశికళతో మంచి స్నేహం ఉందనీ నాకు తెలుసు.

మనం వాళ్లింటికి వెళ్లినప్పుడు అక్కడున్న దూరపు బంధువు వెంకట్రావు బాబాయ్ మాటల మధ్య "పిల్లలిద్దరూ ఈడూ జోడూగా ముచ్చటగా ఉన్నారు. వరసే కాబట్టి వాళ్ల అభిప్రాయం కనుక్కుంటే బావుంటుందిగా, అడగమంటావా?" అని నన్నడిగితే నీకిష్టమని నాకు తెలుసు కాబట్టి సరేనన్నాను.

డైనింగ్ టేబుల్ దగ్గర ప్లేటులో ఏవో సర్దుతున్న భాగ్యలక్ష్మి అత్తయ్యతో ఈ విషయం కదిపినట్లున్నాడు. అత్తయ్య కంఠం ఖంగుమంది.

"పూర్తిగా నెల జీతం రాళ్లమీద ఆధారపడి బ్రతికేవాళ్లకి పిల్లనిచ్చే ఉద్దేశ్యం మాకు లేదు. అదనంగా ఏ రాబడీ లేకపోతే ఏ ఒడిదుడుకులు వచ్చినా తట్టుకోవటం ఎంత కష్టమో నాకు తెలుసు. వీళ్లకేమో సొంత ఇల్లూ లేదూ... సెంటు భూమీ లేదూ..."

బాబాయ్ మధ్యలో కల్పించుకుని "అబ్బాయి బుద్ధిమంతుడు.. మంచి ఉద్యోగం ఉంది... సంపాదించుకోలేకపోతాడా?" అని చెప్పటం మనకూ వినిపించింది.

"నిండుకుండను వదిలి ఎప్పుడో నిండుతుందేమోననే ఆశతో ఖాళీ కుండను భుజానికెత్తుకుంటామా? అయినా ముందేం జరుగుతుందో ఎవరికి తెలుసు! సంపాదిస్తారో... లేక మన పిల్లకిచ్చింది కూడా కైంకర్యం చేసేస్తారో...! ఆస్తుల్ని కరిగించి కాలక్షేపం చేయటమే తప్ప పెంచాలనే ఆలోచనలు ఆ కుటుంబంలో ఎవరికీ రావు! నేను నిష్ఠూరంగా మాట్లాడుతున్నానని అనుకోకుండా నువ్వే చెప్పు అన్నయ్యా... ఖర్చుల మీద కొంచెమైనా అదుపు, రేపటికోసం రవంత పొదుపు... అలవాటు లేని వాళ్లతో కష్టం కాదూ.."

అత్తయ్య వాక్ప్రవాహం అలా సాగుతుండగానే మనం లేచి వచ్చేసాం. వాళ్లకు సరిసాటిగా ఆస్తిపాస్తులు మనకు లేవని మన సంబంధం కాదనుకోవటంలో తప్పులేదు. అది వాళ్ల ఇష్టం. కాకపోతే ఆ మాటల్ని అంత అవమానకరంగా కాకుండా మర్యాదగానూ చెప్పొచ్చు!

ఐశ్వర్యం కొందరు మనుషుల్ని అహంకారపు తెరతో పూర్తిగా కప్పేస్తుంది. వాళ్ల కంటికి వాళ్ల కంటే తక్కువ వాళ్లు అసలు మనుషులుగానే అనిపించరు కాబోలు!

నిన్ను చూడగానే శశికళ మొహంలోకి వచ్చిన వెలుగు చూసి తనకీ నువ్వంటే ఇష్టమని గ్రహించే, వాళ్ల అంతస్థు పెద్దదని తెలిసి కూడా వెంకట్రావు బాబాయ్ అడుగుతానని అన్నప్పుడు సంశయించకుండా సరేనన్నాను. భాగ్యలక్ష్మి మాటలకు కోపం వచ్చినా నిగ్రహించుకున్నాను. నువ్వే అత్తయ్య మాటలకు దూకుడుగా సమాధానం చెప్పి గొడవ చేస్తావేమోనని భయపడ్డాను గానీ అదేం లేకుండా నాతో వచ్చేశావు. ఇంటికి వచ్చాక "అత్తయ్య మాటలకు కోపం రాలేదురా..." అనడిగాను.

"అలా ఇలాక్కాదు ... చాలా కోపం వచ్చింది. ఎప్పటికైనా అత్తయ్య మీద ప్రతీకారం తీర్చుకుంటాను... చూస్తుండు" అని ఒక్క క్షణం ఆగావు. "ఏ విషయంలో మనల్ని వేలెత్తి చూపించి అత్తయ్య చులకనగా మాట్లాడిందో అదే సంపాదించి చూపిస్తాను" అని వెంటనే చిరునవ్వుతో ఇంకో మాట అన్నావు "అత్తయ్య అమర్యాదగా మాట్లాడినా ఒక మంచి మాట కూడా చెప్పింది. అదే ... 'ఖర్చుల మీద అదుపూ, రేపటికోసం పొదుపూ' ఎవరికైనా అవసరమని. ఆ మంచి ముత్యాల్ని మాత్రం తీసుకున్నాను. అది పాటిద్దాం!"

చాలా మంచి మాట చెప్పావని నిన్ను మనసులోనే మెచ్చుకున్నాను.

అవును .. మీ తాతగారు వ్యవసాయాన్ని పనివాళ్లకప్పగించేసి పగలంతా పేకాటతోనూ, పొద్దుగూకేసరికి పదిమందితో మందు పార్టీలతోనూ కాలక్షేపం చేసి అరవై ఎకరాల ఆస్తిని హారతి కర్పూరంలా చేసేశారు. మీ నాన్న కూడా ఆడంబరాల్ని మాత్రం వారసత్వంగా అందుకుని మిగిలిన పదెకరాల్ని కూడా నిలుపుకోలేక అమ్మేశారు. చదువుంది కాబట్టి ఉద్యోగం ఆధారమైంది. అందుకే భాగ్యలక్ష్మి అత్తయ్య అలా మాట్లాడింది.

అత్తయ్య మాటల్లోని మంచిని మాత్రమే తీసుకుని ఎదిగి చూపించటం ద్వారానే ప్రతీకారం తీర్చుకుంటానని నువ్వు చెప్పటం ... నాకు చాలా ఆనందాన్ని కలిగించింది. విషయం తెలిసిన మీ నాన్న "నెల తిరిగేసరికల్లా వాళ్లను మించిన సంబంధం తీసుకువచ్చి నీ పెళ్లి చేస్తాను చూడు..." అంటూ సవాల్ చేశారు.

"గొప్ప సంబంధం మనకు వద్దు... మనల్ని గొప్పగా భావించే వాళ్ల సంబంధమే చేసుకుందాం" అన్నావు. అంతే కాదు, మన వీధిలోనే ఉండే లెక్చరర్ అనంతరామయ్యగారి అమ్మాయి రేఖను చేసుకుంటానని వాళ్ల అభిప్రాయం కనుక్కోమన్నావు. నేనూ, మీ నాన్న ఒక్కసారే "వాళ్లకేం లేదురా..." అనేశాం. నువ్వు నవ్వుతూ "మన పరిస్థితీ అదే కదా!" అన్నావు.

నిజమే. అబ్బాయి పెళ్లి అనుకోగానే కట్నకానుకలిచ్చే వాళ్ల మీదే దృష్టి పెడతాం కాబోలు! రేఖ బావుంటుంది....చదువుకుంది. ఆలోచిస్తే అభ్యంతరం చెప్పాల్సిన విషయాలేం కనిపించలేదు. వాళ్లతో మాట్లాడి సంబంధం నిశ్చయం చేశాం.

శశికళకీ ఆ నెలలోనే బాగా ఆస్తిపాస్తులున్న ఉద్యోగస్తుడితో పెళ్లి నిశ్చయమైందని తెలిసింది. తన పెళ్లి ఇంకో వారం వుందనగా వెంకట్రావు బాబాయ్ ఒక వార్త మోసుకొచ్చాడు. పెళ్లికొడుకు తెలియక చేసిన పొరపాటు వల్ల సస్పెండ్ అయ్యాడంట. మీ ఆఫీసులోని సీనియర్ ఆఫీసర్ని ఎంక్వైరీకి వేశారు. అతను సహాయం చేస్తే ఒడ్డున పడతాడట. లేకపోతే పొరపాటున అయితేనేం అతని వల్ల కంపెనీకి జరిగిన నష్టానికి కేస్ సీరియస్ అయి ఉద్యోగం పోయే పరిస్థితి వచ్చింది. నువ్వు మీ బాస్కి రెకమండ్ చెయ్యాలని మీ చంద్రం మామయ్య కోరుతున్నాడట.

ఆఫీసు నుండి రాగానే వెంకట్రావు బాబాయ్ ఈ విషయం నీకు చెప్పగానే "మామయ్య నాకూ ఫోన్ చేశాడు. మా బాస్ని రిక్వెస్టు చేస్తే, తప్పకుండా సహాయం చేస్తానని ప్రామిస్ చేశారు" అన్నావు.

"ఉద్యోగం పోతే మాత్రం ఏమయిందీ... ఆస్తులున్నాయిగా, కూర్చుని తింటారు. ఏం జరిగినా ఆదుకుంటాయని మీ అత్తయ్య చెప్పిందిగా! అవకాశం వచ్చింది కాబట్టి ఆ రోజు మాటలకు చెప్పు దెబ్బ కొట్టినట్లు చేస్తావనుకుంటే ... నువ్వేంట్రా వాళ్లకే సహాయం చేశావ్?" బాబాయ్ ఆశ్చర్యంగా అడిగాడు.

నువ్వు అంతకన్నా ఆశ్చర్యపోతూ "అదేంటి బాబాయ్ .. శశికళ నా స్నేహితురాలు. ఇష్టమైన అమ్మాయి సుఖంగా ఉండటానికి సహాయం చేయకుండా కక్ష పెంచుకుంటామా..? ఆస్తులున్నాగానీ ఉద్యోగం పోతే .. అది అతనికి మచ్చగా మిగిలిపోదూ?" అన్నావు.

నీ మాటలకు నేను పులకించిపోయాను.

అవును .. నిజమే ... ప్రేమించే మనసు ప్రేమను పంచుతుంది గానీ పగను, ప్రతీకారాన్నీ కోరదు!

రేఖతో నీ పెళ్లి జరిగింది. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తూనే, ఏవో కోర్సులు చదువుతూ ప్రమోషన్లు సంపాదించి ఒక్కొక్క మెట్టూ ఎక్కారు. ఇల్లు కట్టాలనే ఆలోచనతో స్థలాల కోసం వెతికే నీ అలవాటు రియల్ ఎస్టేట్ బిజినెస్కి దారి చూపించింది. ఉద్యోగం చేస్తూ ఏ వూళ్లోవున్నా చవగ్గా వచ్చే స్థలాలు కొనటం ఆ తర్వాతి కాలంలో నీకు బాగా కలిసి వచ్చింది. పిల్లల్ని చూసుకుంటూ రేఖ ఉద్యోగం మానేసినా నువ్వు స్నేహితుల వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టడం నీకు మరింత లాభం చేకూర్చింది.

ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా సంపాదించాలనే ధ్యాసలో నలిగిపోతున్నావనిపించి ఒక సారి నీతో ఆ మాటే అన్నాను.

అప్పుడు నువ్వేం చెప్పావో గుర్తుందా? "నేనెప్పుడూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయను. ఇదే కాదు, నీ భయమేమిటో నాకు అర్థమౌతోంది. నేను ఎంత ఎత్తుకు ఎదిగినా అహంకారాన్ని అణుమాత్రంగానైనా నా దరి జేరనివ్వను. మధ్యతరగతి మనస్తత్వంతో, ఆ అలవాట్లతో క్రమశిక్షణగా బ్రతకటంలోని ఆనందం నాకూ తెలుసుకదమ్మా. పగ్గాలు సరిగా పట్టుకోలేక జీవితాల్ని అస్తవ్యస్తం చేసుకునే వాళ్లు ఐశ్వర్యవంతుల్లోనే కాదు .. అట్టడుగువాళ్లల్లో, అన్ని వర్గాల్లోనూ ఉంటూనే ఉంటారు.. అవునా?" అన్నావు.

నిజమేననిపించింది. నువ్వేం చెప్పినా ఎదుటివాళ్లను ఒప్పించి మెప్పించగలుగుతావు!

అప్పుడప్పుడూ మీరు పిల్లలతో వచ్చి మూడు నాలుగు రోజులుండి వెళ్లిపోయేవాళ్లు. అంతకు మించి ఉండటానికి వీలయ్యేది కాదు.. మేమూ అంతే! అలా రోజులు గడిచిపోయాయి. మీ నాన్న రెండేళ్లకు రిటైర్ అవుతారనగా కాబోలు మీ పిల్లలిద్దరూ మా దగ్గర పదిరోజులున్నారు. ఆ రోజులు నాకు బాగా గుర్తుండిపోయాయి.

నేను జుట్టుముడి సరిగా వేసుకోలేదంటూ తను దువ్వుతానని దువ్వెన పట్టుకుని దీప్తి నా వెంటపడేది. క్రికెట్ ఆడదామంటూ కర్రలు పట్టుకుని దివాకర్ మీ నాన్నను పరుగులు పెట్టించేవాడు. ఇద్దరూ ఎప్పుడూ మా చుట్టూ తిరుగుతుండేవాళ్లు. వెళ్లే ముందు రోజనకుంటా దివాకర్ మీ నాన్నని అడిగాడు. "నాన్న ఉద్యోగం మానేసి హైద్రాబాద్‌లో సెటిల్ అవుతారట. మీరు రిటైరయ్యాక మా దగ్గరకు వచ్చేయండి" అని.

వెంటనే సమాధానం చెప్పకపోయేసరికి వాడు నవ్వుతూ "బెట్టు చేస్తున్నట్లుగా ఏదో ఆలోచిస్తున్నారేంటి? మనవడితో స్నేహం చేసే తాతకి అనారోగ్యం ఉండదట... ఆయుష్షు పెరుగుతుందట! నాన్న చెప్పారు..." అన్నాడు.

వెంటనే దీప్తి "పెద్దవాళ్లున్న ఇల్లు ముద్దమందారాలూ, నందివర్ధనాలూ ఉన్న తోటలా అందంగా ఉంటుందని కూడా చెప్పారు. మరి మా ఇల్లూ పూలతోటలా కళకళలాడాలంటే మీరూ మాతో ఉండాలి కదా" ఆరిందాలా అంటూ నవ్వింది.

వాళ్ల మాటలకు మాకు ఏనుగెక్కినంత సంబరం! ముల్లోకాలనూ చుట్టివచ్చినంత మురిపెం! మనవల ముచ్చట్లను మించిన వైభోగం వేరే ఏం ఉంటుందీ అనిపించింది.

తప్పకుండా మీ దగ్గరికి వచ్చి వుంటామని ఆనందంగా చెప్పాం.

పిల్లలు తల్లిదండ్రుల ఆలోచనలకు ప్రతిబింబాల్లా ఉంటారనుకుంటూ ప్రతి రోజూ మీ గురించి, మనవడి, మనవరాలి మాటల గురించి చెప్పుకుని మురిసిపోయేవాళ్లం.

తర్వాత ... నువ్వు బాగా బిజీ అయ్యావు. పిల్లలూ చదువుల హడావుడితో ఒక పూటో, రోజో కంటే ఎక్కువ ఉండటానికి వీలయ్యేది కాదు. రిటైరవ్వగానే మీ దగ్గరకు వచ్చేద్దామని

అనుకున్నాం. కానీ అక్కడ మంచి పొలం బేరం వచ్చేసరికి కొన్నాళ్ళు అక్కడ ఉందామని ఆ డబ్బుతో మీ నాన్న నాలుగెకరాల పొలం కొన్నారు. అక్కడికి దగ్గర్లోనే చిన్న ఇల్లూ ఏర్పాటు చేశారు. కొత్తగా మొదలు పెట్టిన వ్యవసాయంతో మాకూ మీదగ్గరకి వచ్చివుండే తీరిక దొరికేదికాదు.

మీ పిల్లలిద్దరూ ఒకరు ఇంజనీరింగ్, ఒకరు డిగ్రీలోకి వచ్చారు.

క్రిందటి సంవత్సరం అనుకోకుండా మీ నాన్న నన్ను ఒంటరిని చేసి వెళ్లిపోయారు. అప్పుడే నువ్వు కొన్న కొత్త ఇల్లు కూడా చూడలేకపోయారు. నన్ను మీ దగ్గరకు రమ్మన్నా ఈ పొలాన్ని, పనుల్నీ ఎవరికైనా అప్పగించే బాధ్యతతో ఇక్కడే ఉండిపోయి, ఈ మధ్యనే మీ ఇంటికి రాగలిగాను.

మీ స్థితిగతులకు అద్దం పడుతున్న మీ ఇంటిని చూడగానే ఆనందంతో నాకు నోటమాట రాలేదు. అలాంటి అధునాతనమైన, అందమైన ఇంటిని నేనిప్పటివరకూ చూడనైనా చూడలేదు మరి. అన్ని సౌకర్యాలతో నాకూ ఓ గదిని ఏర్పాటు చేశావు. ఆ గదిలో పడుకొన్న రోజు రాత్రి ఆనందంతో నాకు నిద్రే పట్టలేదురా! నిజం!

నా సంబరం ఎన్నాళ్లో నిలవలేదు .. క్రమక్రమంగా కరిగిపోతూ వచ్చింది. .. ఇదీ నిజమేరా! అయినా సర్దుకున్నాను. నగర నాగరికత .. మారిపోతున్న పరిస్థితుల ప్రభావం ఇలాగే ఉంటుంది కాబోలని మనసుని సరిపెట్టుకున్నాను. కానీ ...

ఆ రోజు మధ్యాహ్నం ... కాసేపు టీవీ చూసి హాల్లోనే ఒక వారగా ఉన్న దీవాన్ మీద పడుకున్నాను. నువ్వూ, కోడలూ కూడా ఇంట్లో లేరు. దీప్తి, ఇద్దరు స్నేహితురాళ్లతో వచ్చింది. వాళ్లు గుసగుసగా మాట్లాడుకుంటుంటే నేను పట్టించు కోలేదు. ఇంతలో దివాకర్ కూడా నలుగురు ఫ్రెండ్స్‌ని వెంట పెట్టుకుని వచ్చాడు. అందరూ ఏవో మంతనాలు చేస్తున్నారు. మొదట నాకేం అర్థం కాలేదు. కాసేపటికి విషయం ఏమిటో తెలిసి నేను నిర్విణ్ణురాలినైపోయాను!

ఇంతకీ విషయం ఏమిటంటే.. దివాకర్ కాలేజీలోని ఎవరో అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి వీడి ప్రేమను అంగీకరించలేదు. పైగా “ఇప్పటికే నాలుగు సబ్జెక్టులు రెండుసార్లు తప్పావు. ముందు అవి పూర్తి చేసే పనిలో ఉండు ... ప్రేమ సంగతి తర్వాత ..” అంటూ హేళన చేసిందట. అంతేకాదు... తన ప్రేమని అంగీకరించేవరకూ వాళ్లింటిముందున్న చెట్టుకింద నిలబడే ఉంటానని బెదిరిస్తే .. “మీ ఇంటి కంటే ఈ చెట్టే బెటరని నీకనిపిస్తే, ఇక్కడే సెటిలవు. నాకేం అభ్యంతరం లేదు...” అంటూ నవ్విందట.

“నాకు దక్కని అందం ఇంకెవరికీ దక్కకూడదు.. ఆ అందం మాసిపోవాలి.. ఆ పొగరు దిగిపోవాలి..” అని దివాకర్ అంటే మిగతా అందరూ ఏవేవో మార్గాలు చెబుతున్నారు. ఆశ్చర్యం ఏమిటంటే ... దీప్తి కూడా “ఆ స్టుపిడ్ నన్నూ ఒకసారి ‘మావి మీలా తాగి తూలే జీవితాలు కావు’ అంటూ వెక్కిరించింది. నేను తాగితే ఏమిటి, తూలితే దానికెందుకు... పరాభవం చేయాల్సిందే!” అనటం.

చివరకు అందరూ కలిసి ఆ అమ్మాయిని ఎవరో పిలిచినట్లుగా నమ్మకంగా ఎక్కడికో రప్పించి యాసిడ్ దాడి చేయాల్సిందేనని నిర్ణయించారు! "ఈ దుర్మార్గపు ఆలోచనలేంట్రా..?" అని నేనడిగేసరికి ఉలిక్కిపడ్డారు.

"అమ్మ ముసిలీ ... నువ్విక్కడే వుండి అన్నీ విన్నావా? వింటే విన్నావు గానీ రేఖకీ, వాళ్లాయనకీ చెప్పకు. అనవసరంగా బెంబేలు పడతారు..." తల కొట్టుకుంటూ దివాకర్ అన్నాడు.

"అవేం మాటలురా.." అని మందలిస్తుంటే, అందరూ పగలబడి నవ్వారు. ఫ్యాషన్ ప్రపంచ పోకడలు తెలియని నా అమాయకత్వం వాళ్లకి అంత నవ్వు తెప్పించింది కాబోలు!

హీరో తన తల్లిదండ్రుల్ని పేరుతో పిలుస్తూ నిర్లక్ష్యంగా సమాధానాలు చెప్పటం .. పెద్దవాళ్లను 'ముసలీ' అనటం ... ఇవన్నీ వెరైటీ కోసమో, కామెడీ అనుకునో సినిమాల్లో చూపిస్తుంటే .. నా మనవలు అదే హీరోయిజం అనుకుంటూ గొప్పగా ఫాలో అయిపోతున్నారా..?!

వాళ్ల మాటలు, అలవాట్లు తెలిసేసరికి నాకు నిజంగానే మతిపోయింది! యాసిడ్ దాడి పథకంలో పొరపాటున పట్టుపడినాగానీ భయం లేదంటూ 'మా నాన్నకి ఐ.జి., డి.ఐ.జిలు అందరూ ఫ్రెండ్స్ కాబట్టి ఈజీగా బయటకి వచ్చేస్తాం' అని దివాకర్ ఫ్రెండ్స్‌కి అభయం ఇచ్చాడు.

ఆ రాత్రంతా నాకు భయంతో, ఆందోళనతో నిద్ర పట్టలేదు.

అందమైన, స్వచ్ఛమైన పావురాళ్లలాంటి నా మనవలు వీళ్లేనా ... నిజంగా వీళ్లేనా అని తలచుకుని తలుచుకొని ఆశ్చర్యపోతూనే వున్నాను! వీళ్లలో ఇంత మార్పు ఎలా వచ్చింది? అదుపు లేకుండా వాళ్ల చేతికందుతున్న ధన ప్రభావమా...? ఏమో .. నాకేం అర్థం కాలేదు.

మర్నాడు ఉదయం నాకు తోచిన పని చేశాను. పిల్లలు చెప్పుకుంటుండగా దివాకర్ ప్రేమించిన అమ్మాయి సెల్‌ఫోన్ నెంబరు నేనూ విన్నాను. ఆ నెంబర్‌కి ఫోన్ చేసి నేనెవరో చెప్పకుండా ఆ అమ్మాయి మీద యాసిడ్ దాడి జరగబోతోందనే విషయం చెప్పి జాగ్రత్తగా ఉండమని హెచ్చరించాను. మన ఫోన్ నెంబర్ వాళ్లకి తెలుస్తుందేమోనని నేను సంకోచించలేదు... ఎటునుండి ఎటువచ్చినా తప్పించుకునే మార్గాలు మీకు సవాలక్ష తెలుసు కదా!

నీకెందుకు చెప్పలేదని నువ్వు అడుగుతావని నాకు తెలుసు. వాళ్లు నీ మాటా, కోడలి మాటా వినే దశ దాటిపోయారని ఆ కొద్ది రోజుల్లోనే నేను గ్రహించాను. వట్టిదే అని బుకాయించి వాళ్లు చేసేది చేయగలరని అనిపించింది. అయినా నా ప్రయత్నంగా దివాకర్‌కి గట్టిగానే వార్నింగ్ ఇచ్చాను. ఆ రోజు నుండి ఇంట్లో తిరుగుతుంటే నాకు ఊపిరాడనంత ఇబ్బందిగా ఉంటోంది.

నిజం చెప్పాలంటే .. మీ ఇల్లు ఇల్లులాగే అనిపించట్లేదు. అందరినీ కలిపివుంచే పూలదండలోని దారమేదో తెగిపోయినట్లుగా, అందరూ విడివిడిగా అయిపోయారు. మీ ఇంట్లో నలుగురూ కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకునే సమయాలు లేవు. కలిసి ఒక పూటయినా

భోంచేసే అలవాటూ మటుమాయం అయిపోయింది! అందరూ పార్టీలతో బిజీ .. బిజీ! ఎవరు ఎప్పుడు వస్తారో ఎవరికీ తెలియదు. ఒకరి సంగతులు ఒకరికి పట్టనట్లు వుండటమే వ్యక్తిగత స్వేచ్ఛ అనీ, సంస్కారమనీ మీరందరూ నమ్ముతున్నారు.

కుటుంబ సభ్యుల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం, ఆప్యాయతల పరిమళం లేకపోతే అది ఇల్లు కాదు.. నిర్జీవమైన ఇటుకల భవంతి మాత్రమే!!

నిన్ను అవమానించిన వాళ్లకి ... సంపాదించి చూపించటమే ప్రతీకారం తీర్చుకోవటం అని నువ్వు భావించావు.. ప్రేమించిన అమ్మాయికి సహాయపడటమే ప్రేమ లక్షణం అనుకున్నావు! మరి ఇదేంట్రా .. నీ పెంపకంలో పెరిగిన పిల్లలు తమ ప్రేమను కాదన్న వాళ్ల అంతు చూడాల్సిందేనని విర్రవీగుతున్నారు! ఏ తప్పు చేసినా తప్పించుకోగల అధికులమనే అహంకారంతో తిరుగుతున్నారు. నువ్వు సంపాదనలో పడి నీకు తెలియకుండానే కుటుంబాన్ని నిర్లక్ష్యం చేశావనిపించింది.

పిల్లల మనుసుల్లోని సమాజానికి హాని కలిగించే ఆలోచనలను తెలుసుకోలేకపోవటం, వాళ్లని మందలించకపోవటం .. తల్లిదండ్రుల తప్పే అవుతుంది. పిల్లల పట్ల బాధ్యతారహితంగా ప్రవర్తించటం .. ఇంట్లో బాంబులు తయారుచేయటం కంటే తక్కువ నేరం కాదు!

కోడలు ఎవరికీ ఏమీ చెప్పలేని నిస్సహాయురాలైపోయింది. ఏదో పోగొట్టుకొని .. ఇంకేదో కొనుక్కుంటున్నట్లుగా .. ఖరీదైన వ్యక్తుల పెళ్లిళ్లకు, పార్టీలకు వెళ్తూ కాలక్షేపం చేస్తోందని నాకనిపించింది.

ఏ గిన్నెలో వుంటేనేమి గానీ, రుచికరమైన పాయసమే ముఖ్యమని నేననుకుంటాను. మీకుమాత్రం అది అందమైన, ధగదగలాడే వెండిగిన్నెలో ఉండాలి. రుచితో పట్టింపులేదు. నేనలా రాజీ పడలేక, అక్కడ ఉండలేక ఇక్కడికి వచ్చేశాను. మీ జీవన సరళి అంతేనని, చేయగలిగింది. ఏదీ లేదనీ నువ్వనుకుంటే ... సరే, చేసేదేం లేదు. కానీ చిన్నా ... నా కోరిక ఏమిటంటే నువ్వొక్కసారి వెనక్కి తిరిగి చూసుకో ... నువ్వు సంపాదించిన దానికంటే .. పోగొట్టుకున్నదే ఎక్కువనీ, అదే అమూల్యమైనదని నీకర్థమవుతుంది! గతంలో నీ ఆలోచనలు ఎలా వుండేవో గుర్తు చేసుకుని ... పగ్గాలు చేత పట్టుకుని, నీ ఇంటిని అందమైన పూలతోటలా తీర్చిదిద్దే ప్రయత్నం మొదలు పెట్టాలనుకుంటే, నువ్వు తప్పకుండా సాధించగలుగుతావు .. సాధిస్తావు .. నీ గురించి నాకు తెలుసు!!

చివరగా ఒక మాట .. నా ఉద్దేశ్యం అర్థమైందిగా .. అలాంటి పూలతోటలాంటి మీ ఇంటికి రమ్మనే నీ పిలుపుకోసం నేను ఆశగా ఎదురు చూస్తుంటాను. ముగించనా ఇక ...

ఆశీస్సులతో

అమ్మ

ఆంధ్రజ్యోతి ఆదివారం. 25, జూలై 2010

ఆంధ్రజ్యోతి – అసూన్ హాస్టల్స్ (చీరాల) నిర్వహించిన కథావసంతం కథల పోటీలో బహుమతి పొందిన కథ.